Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

ఆదివారం - 26- జులై - 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN







# విద్యార్థుల అన్ని డిమాండ్లకు కేంద్రం ఓకే

## –ఆందోళనను విరమించిన సీజేపీ

**టీ మీడియా జులై 25, ఢిల్లీ బ్యూరో:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై శనివారం కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మధ్య జరిగిన చర్చలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. సీజేపీ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. విద్యార్థులపై పెట్టిన కేసులను క్రమంగా ఎత్తివేస్తామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు. దిల్లీ, మిగతా రాష్ట్రాల్లో నమోదైన కేసులు ఎత్తివేస్తామని, భవిష్యత్తులోనూ ఎవరినీ కేసులతో వేధించబోమని స్పష్టం చేశారు. అలాగే, బాధిత కుటుంబాలకు పరిహారంపై చర్చించామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణ విషయంలో సీజేపీతో చర్చిస్తామని వెల్లడించారు. దిల్లీలోని కాన్స్టిట్యూషనల్ క్లబ్లో కేంద్రం, సీజేపీ మధ్య జరిగిన మూడో విడత చర్చల్లో కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్రసింగ్, సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా పాల్గొన్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం సమావేశ వివరాలను సంయుక్తంగా మీడియాకు వెల్లడించారు.

**కేసుల ఉపసంహరణపై ప్రభుత్వ హామీ**

ఇదిలా ఉండగా, సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, 'కేవలం దిల్లీలోనే కాకుండా, ఇతర రాష్ట్రాలన్నింటిలోనూ నిరసనకారులపై దాఖలైన అన్ని ఎఫ్ఐఆర్లను ఉపసంహరించుకోవాలన్నది మా రెండో డిమాండ్. ప్రభుత్వం ఆ డిమాండ్ను కూడా అంగీకరించింది. అంతేకాకుండా, ఉపసంహరణ త్వరలోనే జరుగుతుంది. దాఖలైన అన్ని ఎఫ్ఐఆర్ల కాపీలను పంచుకుంటామని ప్రభుత్వం మాకు హామీ ఇచ్చింది. మాకు అందిన చివరి సమాచారం ప్రకారం, దిల్లీలో 15 నుంచి 20 ఎఫ్ఐఆర్లు దాఖలయ్యాయి. ఏది ఏమైనా ఉపసంహరణ త్వరలోనే జరుగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చింది' అని ఆయన పేర్కొన్నారు.

## నీట్ పేపర్ లీక్ నుంచి...

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు..

## –మూడు నెలల్లో దేశవ్యాప్త ఉద్యమంగా మారిన నిరసనలు

## –జంతర్మంతర్లో రాజకీయ నేతల సంఘీభావం

**టీ మీడియా జులై 25, ఢిల్లీ బ్యూరో:** నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంతో ప్రారంభమైన ఆందోళనలు, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, కేంద్రం విద్యార్థుల అన్ని డిమాండ్లకు అంగీకరించడంతో ముగిశాయి. పరీక్షల పారదర్శకత, బాధ్యులపై చర్యలు, విద్యార్థులకు న్యాయం చేయాలనే డిమాండ్లతో ప్రారంభమైన ఈ ఉద్యమం దాదాపు మూడు నెలల పాటు దేశ రాజకీయాలను కుదిపేసింది. పలు రాజకీయ పార్టీలు పరీక్షల పారదర్శకత, బాధ్యులపై చర్యలు, విద్యా సంస్కరణలు కోరుతూ ఆందోళనలు చేపట్టాయి. దీనితో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది.



**నీట్ లీక్ నుంచి ప్రధాన్ రాజీనామా వరకు జరిగిన కీలక పరిణామాలు**

**మే 3: నీట్ పరీక్ష**

2026 మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) దేశవ్యాప్తంగా నీట్- యూజీ పరీక్షను నిర్వహించింది. 22 లక్షలు మంది హాజరయ్యారు.

**మే 12 : లీక్ ఆరోపణలు**

నీట్ పరీక్ష జరిగిన కొద్ది రోజులకే రాజస్థాన్లోని పలు కోచింగ్ కేంద్రాల ద్వారా మెసేజింగ్ యాప్ల్లో ప్రశ్నపత్రాలు, జవాబు కీ లీక్ అయ్యాయంటూ ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. దీంతో పరీక్షల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తాయి.

**మే 16: సీజేపీ ఆవిర్భావం**

ఓ కేసు విచారణ సమయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగానే ఈ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)పుట్టుకొచ్చింది. ఈ వ్యంగ్య రాజకీయ వేదికను అభిజీత్ దిప్కే ప్రారంభించారు. అతి తక్కువ సమయంలోనే ఇన్స్టాగ్రామ్, ఎక్స్ వేదికల్లో దీనికి పెద్దఎత్తున యువత నుంచి మద్దతు లభించింది.

**జూన్ 6: జంతర్మంతర్లో తొలి నిరసన**

అమెరికా నుంచి తిరిగి వచ్చిన అభిజీత్ దిప్కే ఆధ్వర్యంలో జంతర్మంతర్లో తొలి నిరసన జరిగింది. సీజేపీ కార్యకర్తలు, విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, విద్యార్థి సంఘాలు కూడా ఈ నిరసనల్లో పాల్గొని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**జూన్ 7-19 : ధర్నాలు, డిజిటల్ ప్రచారాలు**

సీజేపీ పలు దఫాలుగా ధర్నాలు, డిజిటల్ ప్రచారాలు నిర్వహించింది. పరీక్షా వ్యవస్థలో సంస్కరణలు, బాధ్యులపై చర్యల కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టింది.

**జూన్ 20: దీర్ఘకాలిక ధర్నా**

జంతర్మంతర్లో మరోసారి దీర్ఘకాలిక ధర్నాకు సీజేపీ పిలుపునిచ్చింది. నిరవధిక నిరసనను ప్రారంభించింది.

**జూన్ 21-27 : ఉద్యమానికి ఊపు**

నీట్ రీ ఎగ్జామ్ ముగిసిన తర్వాత నిరసనల్లో పాల్గొనాలని నీట్ అభ్యర్థులకు అభిజీత్ దిప్కే పిలుపునిచ్చారు. ఆ తర్వాత నుంచి రోజూ వందల సంఖ్యలో ప్రజలు నిరసనలకు హాజరయ్యారు. అయితే అప్పటివరకు ఈ ఉద్యమం జాతీయ స్థాయిలో పెద్ద చర్చగా మారలేదు.

**జూన్ 28: సోనమ్ వాంగ్చుక్ దీక్ష**

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ జంతర్మంతర్కు చేరుకుని ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయనతో పాటు ఏఐఎస్ఏకు చెందిన ఆరుగురు విద్యార్థులు కూడా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ దీక్షలో పాల్గొన్నారు.

**జూన్ 30: ఉద్యమం మరింత ఉద్రిక్తం**

సీజేపీ నిరసనలను మరింత విస్తరించేలా ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. 'ప్రధాన్ గో బ్యాక్' పేరుతో దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు ప్రారంభించింది. పలు రాష్ట్ర రాజధానుల్లో నిరసనలు నిర్వహించి ఉద్యమాన్ని విస్తరించింది.

**జులై 1- 17 : విస్తరించిన మద్దతు**

ఈ ఉద్యమానికి విద్యార్థి సంఘాలు, సామాజిక కార్యకర్తలు, ప్రతిపక్ష నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు జంతర్మంతర్కు చేరుకుని మద్దతు ప్రకటించాయి. రాష్ట్ర రాజధానుల్లో నిరసనలు నిర్వహించి ఉద్యమాన్ని విస్తరించింది.

**జులై 18: పోలీసుల జోక్యం వాంగ్చుక్ తరలింపు**

వాంగ్చుక్ దీక్ష 21వ రోజుకు చేరుకున్న వేళ పోలీసులు పోలీసులు అక్కడి నుంచి సఫ్దర్జంగ్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తగా, పలువురు యువ నాయకులు సంఘీభావ నిరాహార దీక్షలు ప్రారంభించారు. వాంగ్చుక్ దీక్షను తానే కొనసాగిస్తానని అభిజీత్ దిప్కే ప్రకటించారు.

**జులై 19: జంతర్ మంతర్కు వేలాది మంది**

పార్లమెంట్ వర్షకాల సమావేశాల తొలి రోజు చేపట్టనున్న నిరసన ర్యాలీకి ముందు జంతర్మంతర్లో వేలాది మంది చేరుకున్నారు.

**జులై 20: ఉద్రిక్తతలు**

50 వేల మందికిపైగా నిరసనకారులు దిల్లీలోని పలు ప్రాంతాలకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పార్లమెంట్ వైపు భారీ ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన వేలాది నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి టియర్గ్యాస్, లాఠీ ఛార్జి నిర్వహించడంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనల్లో నిరసనకారులు, పోలీసులతో కలిపి వంద మందికిపైగా గాయపడినట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో సీజేపీ ప్రతినిధులు కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాను కలిసి వినతిపత్రం సమర్పించినా నిరసనలు కొనసాగాయి.

**జులై 21 నుంచి : కాంగ్రెస్ ఆందోళన, నిరసనలు**

జంతర్మంతర్ పరిసరాల్లో నిరసనలు నిరంతరంగా కొనసాగాయి. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివచ్చి మద్దతు ప్రకటించారు. పలు నగరాల్లోనూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ నిరసనలు జరిగాయి. ప్రతిపక్ష నాయకులు ఉద్యమానికి మద్దతు తెలిపారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ప్రధానమంత్రి నివాసం సమీపంలో నిరసన చేపట్టగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. జంతర్మంతర్ పరిసరాల్లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దిల్లీ మెట్రో పలు 3లో..



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమే

## –సీఎం రేవంత్ రెడ్డి

## –హైదరాబాద్లో భారీ కొవ్వొత్తుల ర్యాలీ

**టీ మీడియా జులై 25, హైదరాబాద్:** ఢిల్లీలో నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీచార్జిని ఖండిస్తూ, సీజేపీ ఇచ్చిన దేశవ్యాప్త పిలుపు మేరకు శనివారం హైదరాబాద్లో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు క్యాండిళ్లు చేతబట్టి విద్యార్థులకు సంఘీభావం తెలిపారు.టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి. శ్రీధర్ బాబు, మహ్మద్ అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ దేశం యువతది వారి భవిష్యత్తును ఎవరూ లాక్కోలేరు, విద్యార్థుల హక్కులను కాపాడాలి అంటూ నినాదాలు చేశారు.

**విద్యార్థులపై దాడులు తగవు: రేవంత్ రెడ్డి**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం, బలప్రయోగానికి దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. విద్యార్థుల గొంతును అణచివేయడం కంటే వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.విద్యార్థుల ఉద్యమం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, ఇది 3లో..






# రైతులెవరూ వరి వెయ్యొద్దు

## –సీఎం చంద్రబాబు

**టీ మీడియా జులై 25, కర్నూలు:** ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న వేళ ఈ ఏడాది రైతులెవరూ వరి పంట వేయవద్దని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఆరుతడి పంటల సాగుతో ఉన్న నీటిని చాలా జాగ్రత్తగా వాడుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం సీమ సాగునీటి ప్రాజెక్టులకు కేవలం రూ. 2వేల కోట్లే ఖర్చు చేస్తే 2 ఏళ్లలోనే కూటమి రూ. 12 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు.అందరికీ హెల్త్ రికార్డులు: కర్నూలు జిల్లా ఆస్పరిలో సంజీవని పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. రికార్డుల గురించి రోగులు, వైద్యులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండేందుకే సంజీవని పథకాన్ని తెచ్చామని చెప్పారు. ఏ ఆసుపత్రికి వెళ్లినా రోగికి సంబంధించిన అన్ని రిపోర్టులు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటాయని, ఏ రోగానికి ఏ చికిత్స ఏ వైద్యుడు అందించగలడో తెలుసుకునే సౌలభ్యం లభిస్తుందన్నారు. దీనివల్ల ప్రపంచస్థాయి వైద్యం అందుతుందని తెలిపారు. ఇందుకోసం వ్యక్తిగత స్థాయిలో, గ్రామాలవారీగా హెల్త్ రికార్డులు తయారు చేస్తామని తెలిపారు. ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం అమల్లోకి వస్తుందని ప్రజావేదిక సభలో స్పష్టం చేశారు.

అప్పటిలోగా ఉక్కు పరిశ్రమ ప్రారంభం

ఎల్నినో ప్రభావంతో తలెత్తిన సంక్షోభాన్ని కలసికట్టుగా ఎదుర్కొందామని రైతులకు సీఎం పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలోని స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ. 197 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. కడప జిల్లాలోని రాయలసీమ ఉక్కు పరిశ్రమను 2028 మార్చిలోగా ప్రారంభిస్తామని సీఎం మరోసారి స్పష్టం చేశారు. లక్ష కోట్లతో ఆగస్టులో శ్రీకారం చుట్టే ఉద్యాన హబ్ పథకం సీమ ముఖచిత్రాన్నే మారుస్తుందని చెప్పారు. సీమ సాగునీటి ప్రాజెక్టులకు వైఎస్సార్సీపీ చేసింది శూన్యమని విమర్శించారు. వేదవతి ప్రాజెక్టు పూర్తిచేసి హంద్రీనీవా నీళ్లు ఆలూరు ప్రజలకు అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. విధ్వంస రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉంటూ మంచి చేసే పార్టీ ఏదో గమనించాలని ప్రజలకు సూచించారు.




# టేక్మాల్ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ తనిఖీలు



**టీ మీడియా, జులై 25, టేక్మాల్:** టేక్మాల్ పోలీస్ స్టేషన్ను డీఎస్పీ ప్రసన్నకుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని కేస్ ఫైళ్లు, రికార్డులను పరిశీలించిన ఆయన, సిబ్బంది వివరాలను ఎస్ఐ అరవింద్ కుమార్ను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... స్టేషన్కు వచ్చే బాధితులతో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో స్నేహభావంతో వ్యవహరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్కూల్లో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు




**టీ మీడియా ,జులై 24 ,ఆత్మకూర్:**సాయుధ దళాల పట్ల గౌరవాని, అమర జవాన్ల త్యాగాలను స్మరిస్తూ, వీర జవాన్లకు నివాళులు అర్పిస్తూ పాఠశాల విద్యార్థులు ర్యాలీ మరియు పరేడ్ ను నిర్వహించారు.వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వాణి హై స్కూల్ లో 26 జులై కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా విద్యార్థులలో దేశభక్తిని మరియు భారత సాయుధ దళాల పట్ల గౌరవాన్ని పెంపొందించడానికి ఘనంగా కార్గిల్ అమరవీరులకు నివాళు లు అర్పిస్తూ, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శ్రీ వాణి హై స్కూల్ విద్యార్థులు ఆత్మకూర్ పట్టణంలో ర్యాలీ చేయడం మరియు పరేడ్ ను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్ పాల్ లత,అంజనీ , హెచ్ ఎస్ జి స్టేట్ సెక్రటరీ సంజీత్ నాయుడు ఆదేశానుసరం ఇట్టి కార్యక్రమంలో క్యాంప్ ఆఫీసర్స్ హరీ కృష్ణ,స్కౌట్స్ మాస్టర్ రాఘవేంద్ర విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ అధికారుల తనిఖీలు

## రికార్డులు, యూరియా యాప్ పరిశీలన



**టీ మీడియా జులై ,25 టేక్మాల్:** మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ విభాగం అధికారుల బృందం శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. మండల కేంద్రంలోని ఒక ప్రముఖ ఆగ్రోస్ ఫర్టిలైజర్ దుకాణాన్ని సందర్శించిన అధికారులు.. ఎరువులు, విత్తనాల నిల్వలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు మరియు బిల్లు పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఎరువుల అమ్మకాల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా, కృత్రిమ కొరత సృష్టించినా లేదా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**యూరియా యాప్' పనితీరుపై ఆరా**

రైతులకు సాగు ఎరువుల పంపిణీ సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న 'యూరియా యాప్' సాంకేతిక పనితీరు, దానివల్ల రైతులకు ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయా అనే విషయాలపై స్థానిక అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. రైతులకు ఎరువులను నేరుగా, పారదర్శకంగా అందజేయాలని స్పష్టం చేశారు.
ఈ తనిఖీల్లో రాష్ట్ర విజిలెన్స్ విభాగం ఎస్పీ శృతి కీర్తి, విజిలెన్స్ వ్యవసాయ శాఖ అధికారి కోటేశ్వర్, టేక్మాల్ మండల వ్యవసాయ అధికారి ఏఓ రాంప్రసాద్తో పాటు పలువురు విజిలెన్స్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగులు అందజేసిన ఎంపిడివో



**టీ మీడియా, జులై 25 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కు సంబందించిన లబ్ధిదారులకు మండల ఎం పి డి వో బి వెంకటేష్ లబ్ధి దారులకు ప్రొసీడింగ్ కాపిలను ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుట్ట నగేష్ సెక్రటరీ నాగరాజు హౌసింగ్ ఎ ఇ రాజు రెడ్డి గ్రామ అధ్యక్షులు జల్లి సుధాకర్ నిరంజన్ రెడ్డి రాఘవేంద్ర చారి హరీకుమార్ రెడ్డి చిన్నరాముడు కె రాజు దశరత్ మల్లికార్జున్ వెంకటేశ్వర్లు చెన్నయ్య పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఆషాఢ శుభ లాభ్ ఆఫర్లు

## – ప్రకటించిన ఖమ్మం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్




**టీ మీడియా ,జూలై 24, ఖమ్మం :** బాధ్యతాయుతమైన జ్యువెలర్ గా పేరుగాంచిన ప్రపంచంలోని అతిపెద్ద ఆభరణాల రిటైల్ సంస్థలలో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో తన అన్ని షోరూమ్లలో 'ఆషాఢ శుభ లాభ్' ఆఫర్లను ప్రకటించింది. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని, వినియోగదారులకు విస్తృత శ్రేణి ఆభరణాలపై ఆకర్షణీయమైన ఆదా అవకాశాలను అందిస్తోంది. ఈ పరిమిత కాల ప్రచారంలో భాగంగా, వినియోగదారులు బంగారం, అన్కట్, రత్నాల ఆభరణాల తరుగు ఛార్జీలపై గరిష్టంగా 30 శాతం వరకు తగ్గింపు, అలాగే డైమండ్ విలువపై గరిష్టంగా 30 శాతం వరకు తగ్గింపు పొందవచ్చు. అదనంగా పాత బంగారం మార్పిడిపై 0 శాతం తగ్గింపు (జీరో డిడక్షన్ ) సదుపాయం కూడా అందుబాటులో ఉంది . దీంతో ఇప్పటికే ఉన్న ఆభరణాలను అప్గ్రేడ్ చేసుకోవడానికి లేదా కొత్త డిజైన్లలో పెట్టుబడి పెట్టడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశం. ఈ ప్రత్యేక ఆఫర్లు 2026 జూలై 15 నుంచి ఆగస్టు 12 వరకు ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ, కర్ణాటకలోని అన్ని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్లలో నిబంధనలు, షరతులకు లోబడి అందుబాటులో ఉంటాయి. ఈ ప్రచారంపై మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ మాట్లాడుతూ శుభ సందర్భాలు భారతీయుల ఆభరణాల కొనుగోలు సంప్రదాయంలో ఎప్పటికీ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయనీ, ఇవి శ్రేయస్సు, కొత్త ప్రారంభాలు కుటుంబ సభ్యులతో పంచుకునే అమూల్యమైన క్షణాలకు ప్రతీకలు అని అన్నారు .మా 'ఆషాఢ శుభలాభ్ ప్రచారం ద్వారా వినియోగదారులకు అత్యుత్తమ విలువను అందించడంతో పాటు నాణ్యత, పారదర్శకత, విశ్వాసం పట్ల మా నిబద్ధతను మరోసారి చాటుతున్నామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని వినియోగదారులందరూ ఈ శుభ సందర్భాన్ని మా విస్తృత ఆభరణాల కలెక్షన్తో జరుపుకుంటూ అద్భుతమైన షాపింగ్ అనుభవాన్ని పొందాలని మనస్ఫూర్తిగా ఆహ్వానించారు. వినియోగదారులు బంగారం, డైమండ్, ప్లాటినం, అన్కట్, రత్నాలు, వెండి ఆభరణాల విస్తృత శ్రేణిని , అలాగే మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రత్యేక సిగ్నేచర్ కలెక్షన్లను అన్వేషించవచ్చు. వివాహాలు, బహుమతులు, ఆధునిక ఫ్యాషన్ రోజువారీ వినియోగం వంటి వివిధ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ కలెక్షన్లు, సాంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక డిజైన్లతో సమన్వయం చేస్తూ ప్రతి వినియోగదారుడి అభిరుచికి అనుగుణంగా ఉంటాయి. వినియోగదారులు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అందించే విశ్వసనీయ కస్టమర్ అష్యూరెన్స్ ప్రయోజనాలను కూడా పొందుతారన్నారు

# సింగరేణికి మీ సేవలు చిరస్మరణీయం

## – సన్మాన సభలో కొనియాడిన పలువురు వక్తలు

## – పదవీ విరమణ సందర్భంగా ఇద్దరు జనరల్ మేనేజర్లకు ఘన సన్మానం

**టీ మీడియా ,జూలై 24, కొత్తగూడెం:** సింగరేణి కాలరీస్ కంపెనీకి అధికారులు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఈ నెల 31వ తేదీన పదవీ విరమణ చేయనున్న సింగరేణి సంస్థ జీఎం(పర్సనల్/ఐఆర్పీఎం) కవితా నాయుడు, జీఎం(ఈ అండ్ ఎం)సెంట్రల్ వర్క్షాప్ దామోదరరావుకి శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేం రాజు ఉద్యోగ విరమణ చేయనున్న ఇరువురికి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం జీఎం షాలేం రాజు మాట్లాడుతూ కవితా నాయుడు, దామోదరరావు సుమారు 37సంవత్సరాలు విశిష్ట సేవలు అందించి సంస్థ అభివృద్ధికి ఉద్యోగుల సంక్షేమానికి సమర్థవంతమైన పరిపాలనకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. విధి నిర్వహణలో వారి నిబద్ధత క్రమశిక్షణ అంకితభావం నాయకత్వ లక్షణాలు సంస్థకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. వారి సేవలు సింగరేణి చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత కవితా నాయుడు, దామోదరరావు మాట్లాడుతూ సింగరేణిలో సేవలందించే అవకాశం లభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని విధి నిర్వహణలో సహకరించిన యాజమాన్యానికి అధికారులు ఉద్యోగులు కార్మిక సంఘాల నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో గడిపిన అనుభవాలు జీవితాంతం మరపురానివిగా నిలిచిపోతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎంతో పాటు ఎస్.ఓటు జీఎంఎం.గోవిందరావు, వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవి.నరసింహారావు, ఏరియా ఇంజనీర్ వి.రామకృష్ణ, ఫైనాన్స్(ఏజిఎం) బిబత్స, డిజిఎం(ఐఈడి) యోహన్, సిఎంఓఏఐ జనరల్ సెక్రటరీ ఉపేందర్, ఇన్చార్జ్ హెచ్ ఓ డి(సివిల్)కె.రాజారాం, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి.తౌర్య, డిజిఎం(ఈ అండ్ఎం) ఏరియా వర్క్ షాప్ క్రిస్టోఫర్, మేనేజర్(ఐటి) శేష శ్రీ, డివైపిఎం హరీష్, సీనియర్ పిఓ, మజ్జి మురళి, అధికారులు, వివిధ విభాగాల హెచ్ఓడీలు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ఇద్దరు జనరల్ మేనేజర్లకు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# పాఠశాలను తనిఖీ చేసిన మండల విద్యాధికారి



**టీ మీడియా జులై 25 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని ఎం పి పి ఎస్ పెబ్బేరు చెంచువాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి ఎస్ జయరాములు ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు ప్రార్థన సమయానికి హాజరు అయ్యిప్రార్థనలో విద్యార్థుల హాజరు విద్యార్థుల ఆక్టివిటీస్ ని పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రధానంగా ఎఫ్ ఎల్ ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి) పరీక్షా విధానాన్ని పరిశీలించారు విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనావేసే విధానం ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా పద్ధతులు మూల్యాంకన ప్రక్రియపై ఆరా తీసి తగిన సూచనలు చేశారు అనంతరం నాలుగో తరగతి విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాలను ప్రత్యక్షంగా పరీక్షించి వారి చదవడం రాయడం అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పరిశీలించారు అలాగే పాఠశాలలోని ప్రీ-ప్రైమరీ తరగతులను సందర్శించి చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన అభ్యాస వాతావరణాన్ని పరిశీలించారు మధ్యాహ్న భోజన పథకం అమలు భోజన నాణ్యత పరిశుభ్రత నిర్వహణను పరిశీలించారు అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ విద్యార్థుల హాజరు పట్టికలు ఇతర పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు విద్యార్థుల హాజరు క్రమశిక్షణ పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన మండల విద్యాధికారి ప్రతి విద్యార్థి ప్రాథమిక చదవడం రాయడం గణిత నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి చిన్నరాములు ఉపాధ్యాయులు స్వాతి మాధురి రాధా ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ కృష్ణవేణి పుష్పవతి పాల్గొన్నారు.

# కారిడార్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**టీ మీడియా ,జులై 24 ,చిన్నచింతకుంట:** మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం లోని పేదల తిరుపతి శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్తో కూడిన ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను ఆర్ అండ్ బి ఈఎంసి బి.వి రావు , ఎస్ ఇ రాజేందర్ , తదితర అధికారులతో కలిసి పరిశీలించి, అనంతరం దేవస్థానం వద్ద ఏకాదశి సందర్భంగా నిర్వహించిన లక్ష పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధి పై దృష్టి పెట్టి, భక్తుల సౌకర్యార్థం బ్రిడ్జ్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అడిగిన వెంటనే ఎలివేటెడ్ కారిడార్తో కూడిన ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం 110 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు.కారిడార్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, నేడు ఆర్ అండ్ బి ఈ ఎన్ సి బి.వి రావు , రాజేందర్ తదితర అధికారులతో కలిసి పనుల పురోగతిని పరిశీలించామని, అధికారులు శరవేగంగా పనులు పూర్తి చేయాలన్న కృత నిశ్చయం తో పనిచేస్తున్నారని అన్నారు.ఈ బ్రహ్మోత్సవాల నాటికి టెంపుల్ పై వచ్చే బ్రిడ్జ్ నిర్మాణం పూర్తవుతుందని, వచ్చే జూలై నాటికి ఎలివేటెడ్ కారిడార్తో కూడిన ఘాట్ రోడ్డు నిర్మాణం పనులు పూర్తవుతాయని, ముఖ్యమంత్రి . రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ ను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి మదనేశ్వర్ రెడ్డి దేవస్థానం చైర్మన్ బత్తుల బాలరాజు, దేవస్థాన కమిటీ సభ్యులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



**టీ మీడియా ,జూలై 24, ఖమ్మం :** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించేందుకు అధికారులు, వైద్యులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా సేవల నాణ్యతను మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. శనివారం రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్ సేవలు, మెడికల్ వార్డులు, రోగుల నమోదుతో పాటు ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. క్యాజువాలిటీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు మందులు, పరీక్షలు, చికిత్సలు సకాలంలో అందుతున్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రిలోని ఔషధ నిల్వల గదిని పరిశీలించిన కలెక్టర్, అత్యవసర మందులతో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిల్వల నిర్వహణ చేపట్టాలని సూచించారు. మందుల కొరత కారణంగా ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో స్టాక్ ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ల్యాబ్ పరీక్షలు, డయాగ్నస్టిక్ హబ్ సేవలను సమర్థవంతంగా వినియోగించి రోగులకు అవసరమైన పరీక్షల ఫలితాలను వీలైనంత త్వరగా అందించాలని ఆదేశించారు. పరీక్షల నివేదికలు ఆలస్యమైతే చికిత్స కూడా ఆలస్యమవుతుందని, అందువల్ల సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోగులకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు ఒకే చోట అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ అన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణం, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, రోగులు కూర్చునే ఏర్పాట్లు, మౌళిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు నమ్మకమైన ఆరోగ్య సేవల కేంద్రాలుగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ప్రత్యేక వైద్య విభాగానికి సంబంధించిన సేవలు, వైద్యుల అందుబాటు రోజులు, పరీక్షల వివరాలు, చికిత్స విధానాలు, మందుల నిల్వల సమాచారం ఆసుపత్రి ఆవరణలో స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, ఎంపీడీవో అశోక్ సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఘనంగా రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు

## కట్ల సంతోష్ ఆధ్వర్యంలో 3 వేల మందికి అన్నదానం

## ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షలు



**టీ మీడియా ,జూలై 24, వైరా :** ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆకాంక్షించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు శనివారం వైరా రింగ్ రోడ్డు సెంటర్ లో ఘనంగా ఉత్సాహంగా ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేలాది మంది కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్న రాందాస్ నాయక్కు కట్ల సంతోష్, చెరుకూరి కిరణ్ భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక రింగ్ రోడ్డు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు టపాసులు పేలుస్తూ, పూలవర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేను ఊరేగింపుగా తీసుకెళ్లారు. జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి సంబరాలు జరిపారు. జన్మదిన వేడుకల్లో భాగంగా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ దుర్గాప్రసాద్, మార్క్ ఫెడ్ వైస్ చైర్మన్ బోర్రా రాజశేఖర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు , మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తో కలిసి ప్రారంభించారు. సుమారు మూడు వేల మంది ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనం చేశారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమంతో ముడిపెట్టడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ, వైరా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు, సంక్షేమ పథకాల అమలుకు కోట్లాది రూపాయల నిధులను తీసుకువచ్చి అభివృద్ధి పనులను వేగవంతం చేశారని పేర్కొన్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ, తనపై ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు చూపుతున్న ప్రేమాభిమానాలు జీవితాంతం మరువలేనివని అన్నారు. తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా వైరా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల సహకారంతో మరింత బాధ్యతగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొళ్ళ రంగారావు, చెరుకూరి కిరణ్, పమ్మి అశోక్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని, ఖానాపురం సర్పంచ్ బాలాజీ, కౌన్సిలర్లు వోరు శ్రీకాంత్, ధిరావత్ వెంకటేశ్వర్లు, గోరుంట్ల శ్రీదేవి, బత్తుల సుమతి, నాయకులు గుమ్మ రోశయ్య, రాయల రాము, జవాజి నాగరాజు, మచ్చ బుజ్జి, కట్ల నాగరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు చలపతి, సురేందర్, పూర్ణయ్య, ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



# ఫైనాన్స్‌లో బండి తీసుకున్నారా..?

## –వాహన యజమానులపై ఫైనాన్షియర్ ఏజెంట్ల మోసం



**టీ మీడియా జులై ,25 , హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలో నివసిస్తున్న ఓ ఉద్యోగి ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నాడు. ఇతడు కొన్ని నెలల కిందట ఓ ప్రైవేట్ ఫైనాన్షియర్ ఏజెంట్‌తో రూ.లక్ష రుణం తీసుకొని బైక్‌ను కొనుగోలు చేశాడు. తొలుత రెండు, మూడు నెలలు క్రమంగా వాయిదాలు చెల్లించాడు. కానీ తర్వాత ఆర్థిక ఇబ్బందుల వల్ల రెండు నెలలు కిస్తీలు కట్టలేకపోయాడు. దీంతో ఫైనాన్స్ ఏజెంట్లు అతడి ఇంటికి వచ్చి వాయిదాల కోసం ఒత్తిడి పెంచారు.బకాయిలు చెల్లించలేకపోతే తాము సూచించిన వారికి బైక్‌ను విక్రయించాలని బలవంతం చేశారు. మిగతా వాయిదాలు, కేసులు లేకుండా చేస్తామని మభ్యపెట్టారు. దీంతో మరో దారి లేక అతడు వారు చెప్పినట్టు బండిని అమ్మేశాడు. తర్వాత మళ్లీ ఫైనాన్స్ సంస్థ నుంచి నోటీసులు వస్తుండటంతో మోసపోయానని గ్రహించాడు.

**ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం నాటకం**

ఓల్ సిటీ పరిధిలో తన వాహనం చోరీకి గురైందని ఓ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించగా కొత్త కోణం వెలుగు చూసింది. ఆ వాహనం సెకండ్ హ్యాండ్ మార్కెట్లో విక్రయించినట్లు, ఓ ప్రైవేట్ ఫైనాన్షియర్ బీమా సొమ్ము కోసం ఇలా దొంగాట ఆడినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫైనాన్షియర్ నుంచి లోన్ తీసుకున్న వ్యక్తులు, చెల్లింపుల లావాదేవీల వివరాలపై ఆరా తీస్తున్నారు.వాహనాన్ని అద్దెకిస్తామని నమ్మించి అమ్మకం : నగరంలో ఇలా కొందరు ముఠాగా ఏర్పడి రుణాలు ఇప్పిస్తామని చెప్పి అమాయక ప్రజల నుంచి వ్యక్తిగత పత్రాలు సేకరిస్తున్నారు. వారి పేరుతో ఫైనాన్స్, బ్యాంకింగ్ సంస్థల సిబ్బంది సహకారంతో ఎలక్ట్రిక్ వాహనాలు కొంటున్నారు. వాటిని అద్దెకు అందించి తామే కిస్తీలు కడతామని ప్రజలను నమ్మిస్తున్నారు. రెండు, మూడు నెలలు సాఫీగా చెల్లించి, తర్వాత తక్కువ ధరకే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఈ తరహా మోసాలకు పాల్పడిన ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**'అయ్యో నా బండి పోయింది సార్'**

కార్లు, బైకులు, ఆటోలు కొనుగోలు చేసే ముందు లోన్ తీసుకొని సక్రమంగా వాయిదాలు కట్టలేని వారిని ఏజెంట్లు బెదిరించి వాహనాలు లాక్కెళ్తున్నారు. నిబంధనల ప్రకారం వాటిని రుణాలు అందించిన ఆయా బ్యాంకు, ఫైనాన్స్ సంస్థలకు అప్పగించాలి. అలా చేయకుండా సెకండ్ హ్యాండ్ మార్కెట్లో అమ్ముతున్నారు. మిగతా కిస్తీలను రద్దు చేయిస్తామంటూ వాహనం చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేయిస్తున్నారు. కేసు నమోదు కాగానే, బీమా సంస్థలకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

**చెప్పినట్లు చేస్తే వాయిదా, కేసులుండవ్**

ప్రధానంగా వాహన కొనుగోలు కోసం రుణం తీసుకొని సకాలంలో వాయిదాలు చెల్లించని వారిని లక్ష్యంగా చేసుకొని పలువురు ఏజెంట్లు మోసాలకు తెగ బడుతున్నారు. వీరి దందా సులభంగా సాగేందుకు సోషల్ మీడియాలో సెకండ్ హ్యాండ్‌లో తక్కువ ధరకే కార్లు, బైకులు ఇప్పిస్తామని ప్రకటనలు కూడా గుప్పిస్తారు. కొనేందుకు ముందుకు వచ్చిన వారిని వాయిదాలు బకాయిపడిన వాహన యజమాని దగ్గరకు తీసుకెళ్తారు. తమ కస్టమర్‌కు వాహనం అమ్మితే కేసులు, వాయిదాలు లేకుండా వదిలేస్తామని వాహన యజమానికి భరోసా కల్పిస్తారు.

**నగదు చేతికి రాగానే కనిపించరు**

ఆర్థిక పరిస్థితి బాగా లేని వాహన యజమాని గత్యంతరం లేక ఏజెంట్ల మాట విని వాహన తాళాలు అప్పగిస్తున్నారు. బండిని విక్రయించగా వచ్చిన నగదు చేతికి రాగానే ఏజెంట్లు ముఖం చాటేస్తున్నారు. కానీ ఫైనాన్స్ సంస్థల నుంచి మాత్రం మళ్లీ నోటీసులు వస్తుండటంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

# ఐదుగురు అరెస్ట్..

## –నాటు తుపాకులు, తయారీ సామగ్రి స్వాధీనం



**టి మీడియా, జూలై 25, ఏలూరు :** చింతలపూడిలో హత్యకు పథకం రచించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో పాటు, నాటు తుపాకుల తయారీ ముఠాను ఛేదించారు. భట్టువారిగూడెంకు చెందిన సందక సాయిబాబు, అతని స్నేహితుడు తాళం వీరబాబు కలిసి వ్యక్తిగత విభేదాల నేపథ్యంలో పల్నాటి మహేష్ను హత్య చేయాలని కుట్ర పన్ని నాటు తుపాకితో సంచరిస్తుండగా షాదీఖానా సమీపంలో వాహనాల తనిఖీల సందర్భంగా పోలీసులకు చిక్కారు.పోలీసు విచారణలో లభించిన సమాచారంతో వెంకటాద్రిగూడెంకు చెందిన నాటు తుపాకుల తయారీదారు యలగం నాగేశ్వరావు, రాఘవాపురానికి చెందిన వెల్డింగ్ కార్మికుడు తోటకూర రామరాజు, ఏలూరుకు చెందిన బేరల్ తయారీదారు మంతెన వీరభద్రాచారిని అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 6 నాటు తుపాకులు, 4 తూటాలు, పేలుడు పదార్థం, తుపాకుల తయారీ పరికరాలు, వెల్డింగ్ మిషన్, బేరల్ గొట్టాలు, హీరో గ్లామర్ మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.ఎస్పీ కే.పీ.ఎస్. కిషోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి.హెచ్. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సీఐ టి.క్రాంతికుమార్, ఎస్సై కె.సతీష్కుమార్ బృందం ఈ కేసును ఛేదించింది. దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ఐదో అంతస్తు నుంచి దూకి పీజీ వైద్య విద్యార్థిని మృతి



**టి మీడియా, జూలై 25, మేడ్చల్ :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాగారం వెస్ట్ గాంధీనగర్లో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. అపార్ట్మెంట్ ఐదో అంతస్తు నుంచి దూకిన పీజీ వైద్య విద్యార్థిని చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగారం వెస్ట్ గాంధీనగర్లోని భవానీ ప్యారడైజ్ అపార్ట్మెంట్లో నివసిస్తున్న వడ్లకొండ ఆనందచారి, అరుణ దంపతుల కుమార్తె దీక్షిత (26) ఎంబీబీఎస్ పూర్తి చేసి, బెంగళూరు సమీపంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఆప్తాల్మాలజీ పీజీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 17న సెలవులపై ఇంటికి వచ్చిన ఆమె శనివారం అపార్ట్మెంట్ ఐదో అంతస్తు నుంచి దూకింది.తీవ్రంగా గాయపడిన దీక్షితను కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, కారణాలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణకు రాలేదని పోలీసులు వెల్లడించారు. చదువుకు సంబంధించిన ఒత్తిడి సహా అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# ఆశలన్నీ ఆగస్టు పైనే..

## –నర్సరీలో మిర్చి నారు సిద్ధం



**టి మీడియా, జూలై 25, గుంటూరు:**
గుంటూరు మిర్చి ఘాటుకు ప్రపంచంలోనే ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది పండించేందుకు అన్నదాతలు కష్టపడినా కాలం కలిసొస్తే మాత్రం లక్షాధికారులుగా మారతారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న మిర్చి సాగుకు తీవ్ర వర్షాభావం పరిస్థితులు కలవరపెడుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా మిర్చి సాగయ్యే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో,ప్రస్తుతం ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రత్యేకంగా ఆగస్టు,సెప్టెంబర్ నెలలో మిర్చి సాగు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో రైతులు చేపడతారు. ఇందులో ప్రధాన భూమిక మాత్రం పలనాడు ప్రాంతానిది. గత ఏడాది 1.50 లక్షల ఎకరాలకు పైగా మిర్చి సాగు రైతులు చేపట్టినట్లు అంచనా. రైతులందరికీ ఆశించిన మేర దిగుబడులు రాకపోయినా గిట్టుబాటు ధరలు ఆశాజనకంగా లభించాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు మిర్చి వైపు ఆసక్తి చూపే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం వర్షాలు మొహం చాటేయడంతో మిర్చి సాగు చేబడదామనుకున్న రైతులకు, కళ్ళ ముందు కనిపిస్తున్న పరిస్థితులు మింగుడు పడడం లేదు. మరోవైపు మిర్చి సాగు కోసం నర్సరీలలో మిరప నారు పెంపకం వ్యాపారులు చేపట్టారు.మిర్చి సాగు చేపట్టాలనుకుంటున్న రైతులకు ప్రధానంగా వర్షాభావం సవాలుగా మారింది. ఆగస్టు నెలలో వర్షాలు కురిస్తే మిర్చినారు నర్సరీ నుంచి తీసుకువచ్చి నాటతారు. వర్షాలు మొహం చాటేస్తే మాత్రం మిర్చి సాగుపై అనుమానాలు నెలకొంటాయి. గత ఏడాది పరిశీలిస్తే 95 వేల ఎకరాలు, గుంటూరు జిల్లా 45 వేల ఎకరాలు, బాపట్ల జిల్లాలో 30 వేల ఎకరాలు రైతులు సాగు చేపట్టినట్లు అంచనా. ఈ ఏడాది సకాలంలో రుతుపవనాలు వచ్చి ఉంటే,ఇప్పటికే పొలాలు సిద్ధం చేసి మిర్చి రైతులకు పనులు మొదలుపెట్టేవారు. కొన్ని చోట్ల మాత్రం పొలాలను సిద్ధం చేయగా,మరి కొన్ని చోట్ల పొలాల వైపు రైతులు వెళ్లడం లేదు. రుతుపవనాలు కొంత ఆలస్యమైనా ఆగస్టు నెలలో తప్పనిసరిగా వర్షాలు పడతాయి అన్న ధీమా రైతుల్లో కనిపిస్తుంది. 40 రోజులపాటు నర్సరీలో మొక్కలు పెరుగుతాయి కాబట్టి, కొనుగోలు చేసి వెంటనే నాటుకోవచ్చు అన్న ఆలోచన రైతులు చేస్తున్నారు. వర్షాభావం వలన బోర్లు నమ్ముకుని మిర్చి సాగు చేపట్టినా,భూగర్భ జలాలు అడుగంటితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతుంది. వర్షాభావం ఒకవైపు,భూగర్భ జలాలు తగ్గితే ఇబ్బందులు ఎదురవుతాయనే భయం మరోవైపు రైతులను భయపడేలా చేస్తుంది. ఈ సమస్యలు మొత్తానికి పరిష్కారం దొరకాలంటే మాత్రం ఆగస్టు నెల వరకు వేచి చూడాల్సిందేనని రైతుల అభిప్రాయపడుతున్నారు. ఆగస్టు నెలలో విస్తారంగా వర్షాలు పడి జలాశయాలకు నీళ్లు చేరితే మాత్రం సాగు విస్తీర్ణశాతం భారీగా పెరగనుంది. 1,80,000 నుంచి రెండు లక్షల ఎకరాల వరకు, ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలో మిర్చి సాగు చేపట్టేందుకు అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం రైతులు చూపు మాత్రం ఆకాశం వైపు కమ్ముకుంటున్న మేఘాల వైపే ఉంది.ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సుమారుగా 180 వరకు నర్సరీలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ప్రధానంగా మిర్చి నారు పెంపకం నిర్వాహకులు చేపట్టారు. ఒక మొక్క రూపాయిన్నారా నుంచి రెండు రూపాయలు వరకు విక్రయించారు. ఈ ఏడాది వ్యాపారం మరింత ఎక్కువగా ఉంటుందని నిర్వాహకులు భారీగా మొక్కల పెంపకానికి ఏర్పాటు చేశారు. పొలంలో నాటేందుకు నర్సరీలో 40 రోజులు పాటు మొక్క పెరగాల్సి ఉంటుంది. మరో వైపు రైతులు విత్తనాలు కొనుగోలు చేసి నర్సరీలో పెంచుకుంటారు. ఒక మొక్కకు 50 పైసలు చెల్లించి నర్సరీ మొక్కలు పెంచుతున్నారు. మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, వినుకొండ, నరసరావుపేట,చిలకలూరిపేట,గుంటూరు, బాపట్ల,పొన్నూరు, రేపల్లె నియోజకవర్గ ప్రాంతాలలో చూడవచ్చు. నాణ్యమైన మొక్కగా పలనాడు నర్సరీ మొక్కకు పేరుంది. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి మొక్కలు కొనుగోలు చేస్తుంటారు. తెలంగాణలోని కాళేశ్వరం తో పాటు ఇతర ప్రాజెక్టులు రాకతో మిర్చి సాగు పెరిగింది. మిర్చి సాగు కోసం అవసరమైన మొక్కలు తీసుకెళ్తుంటారు. ఇందుకోసం నర్సరీలో గుంటూరు సన్నం(తే4), 341, తేజ, బ్యాడ గి, 273 తో పాటుగా హైబ్రిడ్ రకాలు ఆర్మూరు, బి ఎస్ ఎస్–355, బంగారం, క్లాసిక్, గాయత్రి 155, తేజస్విని తో పాటుగా మరికొన్ని రకాలు రైతుల అవసరాలకు అనుగుణంగా మిరప నారు పెంచుతారు. ప్రస్తుతం విత్తనాలు కొనుగోలు చేసి మొక్కలు పెంచుతున్న రైతులు వర్షాలు పడకపోతే మొక్కలు వదులుకోవాల్సిందే. మరోవైపు రైతులకు విక్రయించేందుకు నర్సరీలో పెరుగుతున్న నారు, 40 రోజులు దాటితే నిర్వహణకు భారంగా మారుతుంది. ఆగస్టు నెల పై ఆధారపడి రైతులు, నర్సరీల నిర్వాహకుల పరిస్థితి ఆధారపడి ఉంది.

# పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచాలి...

## నాణ్యమైన పట్టు ఉత్పత్తికి చర్యలు చేపట్టాలి
## జిల్లా స్థాయి సంప్రదింపుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్



**టి మీడియా, జూలై 25, ఖమ్మం:** జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన 'నా పట్టు – నా అభిమానం 2.0' జిల్లా స్థాయి భాగస్వామ్యుల సంప్రదింపుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర పట్టు బోర్డు బెంగళూరు మరియు తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ పట్టుపరిశ్రమ రైతులతో ఎన్ని ఎకరాలు చేస్తున్నది, ఎంత కాలం చేస్తున్నది, ఖర్చు, నీటి వినియోగం, రాబడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 150 ఎకరాల్లో పట్టుపరిశ్రమ ఉందని, ఈ విస్తీర్ణాన్ని 1000 ఎకరాలకు పెంచే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేసి, రైతులకు పట్టుపరిశ్రమ పై అవగాహన కల్పించి, జిల్లాకు క్లస్టర్ హోదా సాధించాలన్నారు. కేంద్ర పట్టు బోర్డు అభివృద్ధి చేసిన ఆధునిక సాంకేతికతలను ప్రతి రైతు తప్పనిసరిగా ఆచరణలోకి తీసుకువచ్చి ఆత్మనిర్భరత సాధించాలని సూచించారు. తెలంగాణలో పట్టుపరిశ్రమ అభివృద్ధిలో ఖమ్మం జిల్లా అగ్రగామిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. పట్టుపరిశ్రమ కు నీటి వినియోగం చాలా తక్కువని, రిస్క్ కూడా తక్కువని, రాబడి ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. అనుభవజ్ఞులైన రైతులు ఇతర రైతులకు అవగాహన కల్పించి, చైతన్యం తేవాలన్నారు. సబ్సిడీ పెంపు విషయమై ప్రభుత్వానికి ఫీడ్ బ్యాక్ సమర్పిస్తామని, ప్రస్తుతానికి సబ్సిడీ తో పాటు లబ్ధిదారులు కొంత భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు. ఒక్కో రైతు విడివిడిగా కాకుండా ఎక్కువ మంది రైతులు కలిసి చేస్తే మార్కెటింగ్ లాభం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర పట్టు బోర్డు, బెంగళూరు సీనియర్ సైంటిస్ట్ డా. జి. సుబ్రహ్మణ్యం కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. పట్టు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందించి, ఉత్పాదకత, నాణ్యతను మెరుగుపరచడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త సంచాలకులు అనసూయ జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో జిల్లా లో పట్టు పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో నిర్వహించిన బేస్లైన్ సర్వే వివరాలను సమీక్షించి, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, నాణ్యమైన పట్టు ఉత్పత్తి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కేంద్ర పట్టు బోర్డు, ములుగు కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపమ్ రెడ్డి, డాక్టర్ గుండి రాఘవేందర్, హార్టికల్చర్ అధికారిణి అనిత శ్రీ, అధికారులు, రైతు ప్రతినిధులు, ఇతర భాగస్వామ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ధరణి అక్రమాలపై ప్రత్యేక విచారణ కమిటీ

## విస్తృత అధికారాలతో సర్కార్ చర్యలు




**టి మీడియా, జూలై 25,హైదరాబాద్ :** తెలంగాణలో సాగుభూముల లావాదేవీల కోసం గతంలో అమల్లోకి తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిటీ కి విస్తృత అధికారాలు కల్పించింది. పోర్టల్ రూపకల్పన నుంచి టెండర్ల ప్రక్రియ, నిర్వహణ, భద్రత, లావాదేవీలు, పోర్టల్ వెలుపల జరిగిన అనుమానాస్పద ట్రాన్సాక్షన్ల వరకు అన్ని అంశాలపై లోతైన దర్యాప్తు చేయాలని ఆదేశించింది.అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా కమిటీ ఛైర్పర్సన్గా నియమితులయ్యారు. కమిటీలో ముగ్గురు ఐపీఎస్, ముగ్గురు ఐఏఎస్ అధికారులు, అలాగే నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ కు చెందిన ఒక సాంకేతిక నిపుణుడు సభ్యులుగా ఉన్నారు.

**ధరణి వ్యవస్థపై సమగ్ర దర్యాప్తు**

2020 అక్టోబర్ 29న ప్రారంభమైన ధరణి పోర్టల్కు సంబంధించిన టెండర్ల పిలుపు, బిడ్ల పరిశీలన, సంస్థ ఎంపిక, సాఫ్ట్వేర్ రూపకల్పన, నిర్వహణలో నిబంధనలు పాటించారా లేదా అనే అంశాలను కమిటీ పరిశీలించనుంది. అప్పట్లో టెండర్ పొందిన సంస్థపై వచ్చిన ఆరోపణలు, పెట్టుబడుల వివరాలు, వాటి చట్టబద్ధతపై కూడా విచారణ జరపనుంది.అనధికార లావాదేవీలపై ప్రత్యేక దృష్టిపోర్టల్ నిర్వహణలో జరిగిన అనుమానాస్పద లావాదేవీలు, అధికారిక సమయాల తర్వాత జరిగిన రిజిస్ట్రేషన్లు, భద్రతా లోపాలు, లాగిన్ రికార్డులు లేకుండా జరిగిన కార్యకలాపాలు, చెల్లింపు గేట్వేలో లోపాలు, ప్రభుత్వానికి చేరాల్సిన రుసుముల వ్యవహారాన్ని కూడా కమిటీ పరిశీలించనుంది.అలాగే, పోర్టల్ వెలుపల జరిగిన భూ లావాదేవీల ద్వారా ఎవరికైనా అక్రమ లబ్ధి చేకూరిందా అనే అంశాన్ని కూడా విచారణలో భాగం చేయనుంది.

**ఫోరెన్సిక్, సాంకేతిక సహకారం**

విచారణలో అవసరమైతే ఫోరెన్సిక్ నిపుణులు, సాంకేతిక సంస్థలు, డొమైన్ ఎక్స్పర్ట్ల సేవలను వినియోగించుకునే అధికారం కమిటీకి ప్రభుత్వం కల్పించింది. విచారణ పురోగతిపై ఎప్పటికప్పుడు మధ్యంతర నివేదికలు సమర్పించాలని, అవసరమైన చట్టపరమైన చర్యలపై సిఫార్సులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

**కమిటీ సభ్యులు**

ప్రత్యేక విచారణ కమిటీలోఏసీబీ డీజీ చారు సిన్హా – ఛైర్పర్సన్కౌంటర్ ఇంటెలిజెన్స్ ఎస్పీ సింధు శర్మసైబర్ సెక్యూరిటీ ఎస్పీ హర్షవర్ధన్ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టిసీఎంఆర్వో ప్రాజెక్టు డైరెక్టర్ అపూర్వ చౌహాన్ఉట్నూరు ఐటీడీఏ పీవో మందా మకరంద్ఎన్ఐసీకు చెందిన ఒక సాంకేతిక నిపుణుడు సభ్యులుగా ఉన్నారు.ప్రభుత్వం ఇప్పటికే ధరణి స్థానంలో భూ భారతి వ్యవస్థను అమల్లోకి తీసుకురాగా, ఇప్పుడు ధరణి పోర్టల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ ద్వారా బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా ముందుకు సాగుతోంది.

# కార్గిల్ అమరవీరులకు త్రివేణి ఘన నివాళి

## –దేశభక్తిని చాటిన కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



**టి మీడియా, జూలై 25, ఖమ్మం:** 'వీరుల త్యాగాలను స్మరిద్దాం... దేశభక్తిని పెంపొందిద్దాం' అనే సందేశంతో త్రివేణి టాలెంట్ స్కూల్స్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్–2026ను శనివారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఆయన మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరుల త్యాగం చిరస్మరణీయమని, వారి ధైర్యసాహసాలు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, 1999 కార్గిల్ విజయం దేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించబడిందని, సైనికుల త్యాగం వల్లే నేడు స్వేచ్ఛ అనుభవిస్తున్నామని తెలిపారు. దేశభక్తి, బాధ్యత, ఐకమత్యాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమం ప్రార్థనా గీతంతో ప్రారంభమై, విద్యార్థులు ప్రసంగాలు చేశారు. ఉపాధ్యాయులు దేశభక్తి కవితలు ఆలపించగా, అందరూ కలిసి దేశభక్తి గీతాలు పాడారు.జై జవాన్ – జై కిసాన్ అంటూ నినాదాలు చేసారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. రెండు నిమిషాల మౌనం పాటించి ఘన నివాళులర్పించారు. విద్యార్థులు దేశ సమగ్రతకు కట్టుబడి మంచి పౌరులుగా ఎదగాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..

(మొదటి పేజీ తరువాయి)

దేశ యువత సాధించిన విజయమని రేవంత్ రెడ్డి అన్నారు. అయితే ఈ విజయాన్ని కాంగ్రెస్ పార్టీ ఖాతాలో వేసుకోవడం లేదని, విద్యార్థుల ఉద్యమానికి పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా దేశవ్యాప్తంగా మద్దతు లభించిందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును యువతే తీర్చిదిద్దుతుందని పేర్కొన్న రేవంత్ రెడ్డి, 21 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అదే వయసులో యువత మంత్రులైతే దేశ భవిష్యత్తు మరింత మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీదేనని గుర్తు చేశారు. దేశ ప్రజాస్వామ్యాన్ని, విద్యార్థుల హక్కులను కాపాడేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు.

**సోమవారం లోపు కేసులన్నీ ఉపసంహరించుకోవాలి**

నీట్ వివాదంపై నిరసనలు తెలిపిన విద్యార్థులపై నమోదైన కేసులను సోమవారం లోపు పూర్తిగా ఉపసంహరించుకోవాలని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఈ వివాదం నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం ప్రకటించాలని కోరారు. యువత ప్రారంభించిన ఈ ఉద్యమం ఇక్కడితో ఆగిపోకూడదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను యువత, విద్యార్థులు ధైర్యంగా ఎదిరించారని వ్యాఖ్యానించారు. ఈ క్యాండిల్ ర్యాలీ ద్వారా విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను తీసుకురావాలని, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నీట్ పేపర్ లీక్ నుంచి...

(మొదటి పేజీ తరువాయి)

స్టేషన్లను తాత్కాలికంగా మూసివేసింది.

**జులై 23–24: ప్రధాని హామీ– దీక్ష విరమణ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కఠిన చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో కేంద్ర మంత్రుల సమక్షంలో సోనమ్ వాంగ్చుక్ తన నిరాహార దీక్షను విరమించారు.

**జులై 24: ప్రభుత్వంతో చర్చలు**

సీజేపీ ప్రతినిధులతో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమావేశమయ్యారు. అయితే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్పై సీజేపీ వెనక్కి తగ్గలేదు. నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి 24 గంటల గడువు ఇచ్చినట్లు ప్రకటించింది.

**జులై 25: రాజీనామాతో ముగిసిన కీలక ఘట్టం**

దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతుండగా, సీజేపీతో జరగాల్సిన మూడో విడత చర్చలకు కొన్ని గంటల ముందే ధర్మేంద్ర ప్రధాన్ ప్రధాని నరేంద్ర మోదీకి రాజీనామా సమర్పించారు. నీట్–యూజీ ప్రశ్నపత్రం లీక్ వివాదానికి నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీంతో మూడు నెలలుగా కొనసాగిన ఈ ఉద్యమం కీలక రాజకీయ పరిణామానికి దారితీసింది.



**మోదీ నాయకత్వంలో రెండో రాజీనామా**

2014 నుంచి అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో ఓ కేంద్ర మంత్రి తన పదవికి రాజీనామా చేయడం ఇది రెండోసారి. మొదటిసారి 2018లో అప్పటి విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ తనపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఇప్పుడు ధర్మేంద్ర ప్రధాన్ మాత్రమే పదవి నుంచి తప్పుకున్నారు. 2015లో అప్పటి కేంద్ర హోంమంత్రి రాజ్నాథ్ సింగ్ ఒక కేబినెట్ సమావేశం అనంతరం 'ఎన్డీఏ ప్రభుత్వంలో మంత్రుల రాజీనామాలు ఉండవు' అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత దాదాపు 11 ఏళ్లకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.